ఇదే గుంటూరు బస్ స్టేండ్‌కి తను చిన్నప్పుడు ఎన్నిసార్లో నాన్నగారితో కలిసి స్వంత కారులో వచ్చాడు. అప్పుడు తను ఒక ఆఫీసరుగారి అబ్బాయి! నల్లని బూటూ ఎర్రని సాక్సూ మడత నలగని టెర్లిన్ దుస్తులూ, పక్కకి దువ్విన నల్లని ఉంగరాల జుట్టూ, చూసేవాళ్ళకి ఎంతో ముద్దుగా ఆకర్షణీయంగా ఉండేవాడు. తనని చూసి ముచ్చటపడి అయితేనేం, నాన్నగారి ప్రాపకం సంపాదించడం కోసం అయితేనేం, ఎవరో ఒకరు బిళ్ళలో ఏపిల్సో కొని ఇస్తూండేవారు తనకి. ఆ రోజులే వేరు. పాతిక సంవత్సరాలు పాతిక నిమిషాలులా పరిగెత్తేశాయి తన జీవితంలో.

ఇవాళ మళ్ళీ అదే గుంటూరు బస్ స్టేండ్‌లో ఆర్. టి. సి. బస్ డ్రైవరుగా నిలబడ్డాడు తను. గుంటూరు నుంచి నిడదవోలు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ బస్‌కి తను డ్రైవరు. ఆ నిడదవోలులో కూడా నాన్నగారు ఒక ఏడాది పనిచేశారట తను పుట్టకముందు.

తాడు లాగి గంటకొట్టి 'రైట్. పోనియ్యి గురూ. మళ్ళీ బెజవాడదాకా ఎక్కడా ఆపకు' అన్న కండక్టరు హెచ్చరికతో జయరాం ఆలోచనల్లోంచి తేరుకొని హారన్ మోగించి బస్ స్టార్ట్ చేశాడు. కండక్టరు ఇంకా డోర్ వెయ్యనే లేదు. జయరాం స్టీరింగ్ వాలుగా కోసి ఒక్క ఊపులో బస్సుని జి. యన్. టి. రోడ్డు ఎక్కించాడు. బస్సులో ఉన్న జనం వాలి పక్కవాళ్ళ మీద పడబోయి మళ్ళీ అంతలోనే సర్దుకుని జయరాం కేసి కోపంగా చూశారు.

'గురూ! నెమ్మదిగా నడుపు! ఇలా అయితే నిడదవోలు వెళ్ళేటప్పటికి ఒక్క శాల్తీ మిగలదు' అని కండక్టరు అరిచిన అరుపు జయరాంకి వినిపించనేలేదు; అతని ఆలోచనలు జి. యన్. టి. రోడ్డుమీద బస్సులాగ మెత్తగా సాగిపోతున్నాయి.

గంభీరంగా ఉండే నాన్నగారు. గలగలా నవ్వుతూ ఎప్పుడూ ఆప్యాయతని వర్షించే అమ్మ. నాన్నగారంటే భయం, అమ్మంటే భక్తి. తన చిన్నతనం అంతా అలాగే సాగింది. కాని క్రమంగా పెద్దవాడయి రకరకాల స్నేహితుల ప్రభావం తనమీద పడేసరికి నాన్నగారంటే విసుగూ కోపం నిర్లక్ష్యం, అమ్మ అంటే ఉదాసీనం, లోకువ, నీరసభావం ఏర్పడ్డాయి. అలా కాకుండా చిన్నతనంలో ఉండే భయం భక్తి తల్లిదండ్రుల మీద ఉంటేనా, తన పరిస్థితే వేరుగా ఉండేది. ఈ బస్సు డ్రైవరు ఉద్యోగం చేసుకుని బ్రతకవలసిన స్థితి తనకి పట్టకపోను. ప్చ్.... ఇంతకీ ఇప్పుడనుకొని ఏం లాభం?

బస్ కృష్ణా బేరేజీ ఎక్కింది. జయరాం తన ఆలోచనల్లోంచి తేరుకొని బస్ వేగం తగ్గించి, జన సమ్మర్దంగా వున్న విజయవాడ వీధుల్లోంచి అతి సమర్థంగా బస్ నడుపుతూ, మొత్తానికి చేరవలసిన టైముకి అయిదు నిముషాలు ముందే బస్‌ని స్టేండ్‌కి చేర్చాడు జయరాం. బండి ఆపి ఇగ్నేషియన్ కీ తీసి పాంట్ జేబులో వేసుకుంటూ కిందకి దూకాడు.

వెంటనే పక్క బస్సులోంచి దిగిన మరో డ్రైవరు వచ్చి జయరాం వీపు మీద చరుస్తూ 'ఏం బ్రదర్! అప్పుడే లాంగ్ రూట్ ఎక్స్‌ప్రెస్ ఎక్కావేం?' అన్నాడు. జయరాం ఏం సమాధానం చెప్పలేదు. తన వీపు మీంచి అతని చేతిని భారంగా తీసేసి, పేంట్ జేబులోంచి సిగరెట్టు తీశాడు. 'ఓటిలా పారెయ్యి బ్రదర్.' అని పక్క డ్రైవరు నోరు తెరిచి అడగడంతో జయరాం మిగిలిన రెండో సిగరెట్ అతనికి అందించి కాళీ పెట్టెని బస్సు టైరుకి వేసి గట్టిగా కొట్టాడు.

అగ్గిపెట్టె జయరాం చేతిలో పెడుతూ, 'మరైతే మకాం గుంటూరా, నిడదవోలా?' అన్నాడు పక్క డ్రైవరు. కాలుస్తూన్న సిగరెట్ గట్టిగా ఓ దమ్ము లాగి 'నిడదవోలే!' అన్నాడు జయరాం.

'అదేంటి? గుంటూరైతే మంచి లైఫ్ ఉంటుంది, సినీమాలుంటాయి — అక్కడేం ఉంది?' అన్నాడు పక్క డ్రైవరు నీరసంగా చప్పరిస్తూ.

జయరాం పొగ రింగు రింగులుగా వదుల్తూ కళ్ళు కొద్దిగా మూసి తెరుస్తూ 'అక్కడా....? అక్కడకి గోదావరి దగ్గరనీ....' అన్నాడు నిర్లిప్తంగా.

పక్క డ్రైవరు పకపకా నవ్వి 'నువ్వింకా వేదాంతం విరక్తీ మానలేదు బ్రదర్. అయినా నేనొక్కటి చెప్తాను విను. ఏ ఉద్యోగంలోనైనా జేరేదాకానే కాని, జేరాక ఆలోచించకూడదు. అయినా మన ఉద్యోగానికి వచ్చిన లోటేవిటి? ఒకటో తారీఖు వచ్చేటప్పటికి నూట తొంభై అయిదు రూపాయలు వచ్చి చేతిలో పడతాయి. ఇంక్రిమెంట్స్ కలిస్తే సరేసరి. రెండు వందల


Pani
ఆఫీసరుగారి
అబ్బాయి
పోలాప్రగడ
రాజ్యలక్ష్మి

ఏభై ఏమిటి మూడు వందలు కూడా కళ్ళ చూడొచ్చు. స్టీరింగ్ దగ్గర హుషారుగా మహారాజులా కూర్చుని ఇంత మంది ప్రయాణీకుల్ని మజిలీ మజిలీ దగ్గరా ఆపి వారి వారి గమ్యాలు చేరుస్తూంటే ఎంత గర్వంగా ఉంటుంది బ్రదర్!' అన్నాడు.

ఆఖరి దమ్ము లాగి, సిగరెట్‌ని నేల మీద పడేస్తూ 'ఆఁ....వీళ్ళ గమ్యాలు మాత్రం మనం చేరుస్తాం. మన గమ్యాన్ని మనం ఎప్పటికీ చేరుకోలేం. ఆ దేవుడు కూడా మనల్ని అక్కడికి చేర్చడు' అన్నాడు జయరాం మామూలు విరక్తితో.

'ఎందుకు చేర్చడు? మంచి చేసిన వాళ్ళకి మంచి తప్పకుండా చేస్తాడు దేవుడు,' అంటూ ప్రక్క డ్రైవరు వెళ్ళి తన బస్సు ఎక్కి హారన్ కొట్టాడు.

'వీడికేం తెలుసు తన బాధ! ఒక రోజున గొప్పగా బతికినవాడు ఇవాళ తక్కువగా బతకాలంటే ఎంత కష్టం!....హుఁ!....ఇంతకీ అంతా స్వయంకృతాపరాధం' అనుకుంటూ జయరాం వెళ్ళి ఒక సోడా తాగి దాహం తీర్చుకొని వచ్చి బస్సు ఎక్కి సీటులో కూర్చున్నాడు.

వెనక నుంచి 'గురూ! ఉండు. అప్పుడే బండి పోనియ్యకు. టిక్కెట్లు కొయినియ్యి' అంటూ అరిచాడు కండక్టరు. దాంతో తన ఆలోచనలతో పాటు బస్సుకి కూడా బ్రేక్ వేసి కూర్చున్నాడు, తిరిగి ఆ కండక్టరే 'రైట్....పోనియ్యి' అనే దాకా.

బస్ స్టాండు వదిలి ఊరు దాటి తారురోడ్డు మీద స్పీడ్‌గా పోతోంది. ఎదర ఎక్కువగా లారీలూ బస్సులూ రావడం లేదేమో, మంచి స్పీడ్ పెట్టి స్టీరింగ్ మీద ఓ చెయ్యి వేసి జయరాం తిరిగి ఆలోచనల్లో పడ్డాడు.

అమ్మది నిండైన విగ్రహం. ఇప్పటికీ నవ్వుతూ 'బాబూ వచ్చావా?' అంటూ ఆప్యాయంగా పలకరిస్తే ఎక్కడి శ్రమ అక్కడే పోతుంది తనకి. చిన్నప్పుడు కూడా ఎంత ఆలశ్యంగా వచ్చినా నాన్నగారు కేకలు వేసేవారు కాని అమ్మ మాత్రం 'వచ్చావా బాబూ!' అంటూ పలకరించి, నాన్నగారితో 'వాణ్ణి ఊరికే కేకలెయ్యకండి. ఒక్కగాని ఒక్క బిడ్డ. కాస్త స్నేహితులతో కలిసి అలా తిరిగి వస్తే ఏం పోయింది ఇంతలో?' అనేది. తనకి ఇష్టం అని అప్పటికప్పుడు వేడివేడిగా వడియాలు వేయించి పెట్టి, తల నిమిరి, దగ్గర కూర్చోపెట్టుకొని అన్నం పెడుతూంటే, అమ్మ మీద చెప్పలేనంత ప్రేమా, ఎప్పుడూ కేకలేసే నాన్నగారి మీద చెప్పలేనంత కోపం వచ్చేసేవి.

రోడ్డు మీద జోరుగా పోతూన్న బస్సుని ఆపమని అడపా దడపా కొందరు మనుష్యులు రోడ్డు ప్రక్క నిలబడి చేతులు అడ్డం పెడుతున్నారు. ఆలోచనల్లోంచి తేరుకుని జయరాం 'సీట్లు ఖాళీ ఉన్నాయా?' అన్నాడు వెనక్కి కండక్టరు కేసి తిరక్కుండానే.

'సీట్లు లేవు గురూ—ఏలూరు దాకా ఆపకు. పోనీ' అన్నాడు కండక్టరు.

ఇంతలోకే బస్సులో ఒక ముసలాయన అందుకొని 'బస్సులో సీట్లు లేవు, కాలేజీల్లో సీట్లు లేవు, ఆఫీసులలో ఉద్యోగాలు లేవు, అంగట్లో బియ్యం లేవు, ఆస్పత్రుల్లో మందులు లేవు, జేబుల్లో డబ్బులు లేవు, ఇన్ని లేకపోయినందుకు శరీరాల్లో ప్రాణాలు కూడా లేకపోతే....' అంటూంటే జయరాం ఒళ్ళు ఒక్కమారు భయంతో జలదరించింది. తను సరిగ్గా దృష్టి పెట్టుకుని డ్రైవ్ చెయ్యకపోతే అదే జరుగుతుంది బస్సులో ఉన్న జనానికి. ఇప్పటికే ఓ మారు చెట్టుకి కొట్టుకోబోయింది. ఇంకోమారు రాళ్ళ గుట్ట ఎక్కేసి తిరగబడబోయింది. ఆలోచనలు కట్టిపెట్టి జాగ్రత్తగా నడపాలి బస్.

ఎంత వద్దంటున్నా ఆలోచనలు వస్తూనే ఉన్నాయి జయరాంకి.

పదేళ్ళు వచ్చేదాకా ఏం జాగ్రత్తగా పెరిగాడో ఏమో తను. అంతే—ఆ తర్వాత పదహారేళ్ళు వచ్చి, స్కూల్ ఫైనల్ పేసయ్యే సరికి, ఈ అయిదారేళ్ళల్లోనూ ఎన్నో సంగతులు నేర్పేశారు స్నేహితులు. తనకి చాలా సంగతులు తెలిసిపోయాయి. నిద్రపోయిన ఆ ఏడెనిమిది గంటలూ ఇంట్లో ఏం ఉండేవాడో ఏమో అంతే—తక్కిన సమయం అంతా స్నేహితులతోటే—ఓ కబుర్లా కేరింతలా, ఆటలా, అల్లర్లా, అగడాలూ, ఓహ్ ఆ అయిదారేళ్లూ అయిదారు నిమిషాలులా గడిచిపోయాయి. ఆ సమయంలో చూడని సినిమా, చెయ్యని అల్లరీ, రాని ఆలోచనా లేవు.

ఆ రోజు సంధ్యవేళ శాస్త్రుర్లుగారి మనవరాల్ని గుడి వెనక జడ పట్టుకుని లాక్కపోతే తనీ జన్మకి స్కూల్ ఫైనల్ పేసయ్యి ఉండేవాడు కాదు. ఆ గుంటది బెదిరిపోయి వాళ్ళ తాతకి చెప్పడం, ఆయన హాత్తెరి అంటూ ఇంటి మీదికి రావడం, నాన్నగారు మండిపడి ఆ నాలుగు నెలలూ ఇల్లు కదలకుండా కట్టడి చెయ్యడంవల్ల ఏదో ఆ నాలుగు పాఠాలూ చదివి స్కూలు ఫైనలు పేస్ కాగలిగాడు కాని లేకపోతే తన వల్ల అయే పనేనా అది?

నాన్నగారు తరుచు కేంపులు తిరుగుతూ ఉండటం, అమ్మ గారం చెయ్యడం కారణంగా, అదుపూ, ఆజ్ఞా లేకుండా తను అడ్డదిడ్డంగా పెరిగేవాడు గాని ఇద్దరి అజమాయిషీ, అదుపూ ఉంటేనా, తను నిక్షేపంగా ఏ ఎమ్మేయో పేసయి, ఈ పాటికి నాన్నగారిలా ఏ ఆఫీసరు ఉద్యోగమో చెయ్యకుండా ఉండునా?

అమ్మా నాన్నా దగ్గర వున్నప్పుడే తను అంతంతగా చదివాడు. ఇంక వేరే కాలేజీ చదువు కని బెజవాడలో రూమ్ తీసుకుని ఒక్కడూ ఉంటే ఇంక చెప్పేది ఏం వుంది? తనని ఎలా వున్నావు, ఏం చేస్తున్నావు, ఎక్కడికి వెళ్ళావు అని అడిగేవాళ్ళు లేరు. తన ఇష్టం-కాలేజీ మానేసి పేకాడినా, స్నేహితులతో కలిసి మేట్నీలకీ మార్నింగ్ షోలకీ వెళ్ళినా, రాత్రి పన్నెండింటి దాకా ఆ సందుల్లోనూ ఆ గొందుల్లోనూ తిరిగి తిరిగి ఏ తెల్లారగట్లో రూమ్‌కి చేరుకున్నా కాదనేవాళ్ళు ఎవరు? పుస్తకాలకనీ, కాలేజీ ఫీజులకనీ, తను ఎంతెంత డబ్బు తెప్పించేవాడో ఇంటి దగ్గర్నుంచి—ఎప్పుడూ చుట్టూ వందిమాగధులులాగ అరడజను మంది స్నేహితులు. అందరి హోటల్ బిల్లూ తనే ఇచ్చేవాడు. సినిమాకి వెళితే టిక్కెట్లు తనే కొనడం అందరికీ—ఇంతమంది తన చుట్టూ వున్నారు కదా అని గర్వం.

వెనకనుంచి హారన్ వినిపించి వ్యూఫైండర్ లోంచి చూశాడు జయరాం. ఎవరో చిన్నకారులో వస్తున్నారు. సైడు ఇమ్మని తెగ హారన్ కొడుతున్నారు. జయరాం నవ్వుకొని పక్కకి తప్పించాడు. వెనకనుంచి చిన్న కారు బాణంలా దూసుకొని ముందుకు పోయింది. ముందునుంచి వస్తూన్న లారీని తప్పించి మళ్ళీ రోడ్డు మధ్యగా బస్‌ని పోనియ్యసాగాడు జయరాం.

చుట్టూ చేరి స్నేహితులందరూ పొగుడుతూ వుంటే ఎంత హాయిగా ఉండేదని! ఇంద్ర పదవి అబ్బినట్లూ—చుట్టూ దేవకన్యలు నాట్యం

చేస్తున్నట్లూ అనిపించేది. ఒక్క రోజైనా తన స్థితి ఏమిటో ఆలోచించాడా? ఎంతసేపటికీ మా నాన్న ఆఫీసరు; ఆఫీసరు కొడుకుగా నా హోదా వేరు. ఆ హోదాకి తగ్గట్టు ఉండాలని ఆరాటపడ్డాడే కాని అందుకు అనుగుణంగా బాగా చదువుకుని ఫస్టుగా పేసవాలి అని ఒక్కరోజు, ఒక్క రోజంటే ఒక్క రోజైనా ఆలోచించాడా?

ఏలూరు బస్‌స్టేండ్‌లో బస్సు ఆపి, స్టేండ్ గుమాస్తా పుస్తకంలో సంతకం పెట్టి, పక్క కొట్లోకి వెళ్ళి ఒక సిగరెట్టు ముట్టించాడు జయరాం. మళ్ళీ అతన్ని పాత జ్ఞాపకాలు తరమ సాగాయి.

'టిక్కెట్లు కొట్టెయ్యడం అయిపోయింది. రా గురూ—పోదాం' అంటూ అరుస్తున్నాడు కండక్టరు.

'అబ్బబ్బ — ఈ ఉక్కబోతలో ఛస్తున్నాం. బస్సు కదిలినా కొంత బాగుండును. ఆ డ్రైవరు రాదేవిటి? సిగరెట్టు కాలుస్తూ కాలు ఊపుతూ ఎలా నుంచున్నాడో పెద్ద ఆఫీసరులాగ' అంటూ బస్సులో జనం విసుక్కోసాగారు.

జయరాం అదేం వినిపించుకునే స్థితిలో లేడు.

ఫస్టియర్ శలవలకి ఇంటికి వచ్చినప్పుడు 'ఇలా చిక్కిపోయావేమిటిరా బాబూ!' అని అమ్మ అడిగితే తను సర్ది చెప్పగలిగినంత సులువుగా 'ఇన్ని తక్కువ మార్కులు వచ్చా యేమిటి?' అని నాన్నగారు అడిగినప్పుడు చెప్పలేకపోయాడు. ఏవైనా వాళ్ళ ప్రశ్నలు అరుచిగానే అనిపించాయి అప్పట్లో.

సెకండియర్‌లో కూడా మార్పేం రాలేదు— తన కార్యక్రమంలో — పైగా క్లాసులు మానెయ్యడం స్నేహితులతో తిరగడం మరింత ఎక్కువైంది. రోజులు సరదాగానే గడిచిపోతున్నాయి.

ఓ రోజు సాయంత్రం సెంటర్‌లో నుంచుని సిగరెట్టు కాలుస్తూంటే, తన ముందునుంచే లేత గులాబీ చీరలో ఇరవై ఏళ్ళ మెరుపు తీగ వెళ్ళింది. వదులుగా ఆమె వేసుకొన్న బారు జడ వయ్యారంగా ఇటూ అటూ ఊగుతూంటే, తన మనస్సులో కోరికల కోడెనాగు తల ఎత్తింది. అప్రయత్నంగా సన్నగా విజిల్ వేశాడు.

ఆ అమ్మాయి వెనక్కి తిరిగి మందహాసం చేసింది.

[34 వ పేజీ చూడండి]

ఐ. ఎ. యస్ లో

'ఫస్ట్ క్లాస్' సంపాయించిన

## తొలి మహిళ

## కిరణ్ బతూరా



'ఉద్యోగం పురుష లక్షణం' అన్న పురుషులలోనే కొన్నాళ్ళకు ఒకాయన — ఆ ఉద్యోగాన్ని దృష్టిలో పెట్టుకుని కాబోలు — 'ముదితల్ నేర్వగ రాని విద్య గలదే ముద్దార నేర్పించినన్' అన్నాడు!

మీరట్‌లో ఇరవై రెండేళ్ళ వయసు గల కిరణ్ బతూరా ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ (ఐ.ఎ.యస్.) పరీక్షలలో 'ఫస్ట్ క్లాస్ ఫస్ట్' సాధించి-ముస్సోరిలో శిక్షణకు హాజరవుతూ — 'ఇది అంతర్జాతీయ వనితా వత్సరం అన్న సంగతి మరిచి పోకండి' అని వనితల తరఫున మరో విజయాన్ని ప్రకటించింది!

కిరణ్‌ది మామూలు మధ్య తరగతి కుటుంబమే. కాలేజీ చదువయ్యాక 'ఇంత వరకూ చదివింది చాలు - ఇక పెళ్ళి చేసుకో' అని అనబోతున్న తల్లిదండ్రులతో 'ఆ పాతకాలపు సలహాలు మానెయ్యండి' అని వాదించింది. తాను నేర్చుకోవాల్సిన కొత్త పాఠాలు చాలా ఉన్నాయని, ప్రతి స్త్రీ తన కాళ్ళమీద నిలబడగలిగే అర్హతను సంపాయించుకోవాలని — అలా తనూ కోరుకుంటున్నానని వాళ్ళకు నచ్చజెప్పి — ఒప్పించింది.

జీవితంలో ఔన్నత్యాన్ని సాధించడానికి ధైర్యం, కృషి, ఆత్మ విశ్వాసం, తెలివితేటలు, లౌక్యం కావాలి. ఇవన్నీ తనలో ఉన్నాయన్న నమ్మకాన్ని కుటుంబ సభ్యుల్లో కలిగించింది కిరణ్. ఆ నమ్మకం వెనుక ఆమె సాధించిన 'ఫస్టు' విజయాలు చాలా ఉన్నాయి మరి!

కిరణ్ —'72 లో బి. ఏ. ఫస్టు క్లాసులో పాసై—హేమ్ స్వరూప్ వైవాహిక్ మెడల్ గెల్చుకుంది. ఆ సంవత్సరంలోనే మీరట్ కాలేజీలో ఉత్తమ విద్యార్థినిగా 'ధనప్రకాష్ విమలాదేవి మెడల్' కూడా సాధించింది. మీరట్ కాలేజి వార్షికోత్సవం సందర్భంగా జరిగిన సాంస్కృతిక పోటీలలో అదే సంవత్సరం (72–73) ఆమె వ్యాస రచన పోటీల్లో మరో 'ఫస్ట్ ప్రైజు' సాధించింది. ఆ తర్వాత ఆంగ్ల సాహిత్యంలో యమ్. ఏ. చదివి — అప్పుడూ 'ఫస్ట్ క్లాస్ ఫస్టు'లో పాసయింది. ఇప్పుడు ఈ 'ఐ. ఏ. యస్.' విజయాన్ని సాధించింది!

"నేను ఐ. ఏ. యస్. పరీక్షలకు వెళ్ళడం మొదట మా ఇంట్లో చాలా మందికి ఇష్టం లేదు. ఆ ఉద్యోగాలలో ఎక్కువ బదిలీలు వుంటాయనీ, క్లిష్టమైన సమస్యలనెన్నిటినో ఎదుర్కోవాల్సి వుంటుందనీ వాళ్ళ అభిప్రాయం. కానీ మహిళగా ఒక ఉన్నతమైన పదవిని చేపట్టాలన్న నా ఉత్సాహాన్ని మా నాన్నగారు అర్థం చేసుకుని - నన్ను ప్రోత్సహించారు." అన్నది కిరణ్.

'నేటి విద్యార్థులలో క్రమశిక్షణ చాలా వరకు లోపించింది. చదువుల పట్ల నిర్లక్ష్యంతో పాటు — రౌడీతనం కూడా ఎక్కువైపోతూ వుంది. ఈ ధోరణి అరికట్టకపోతే ముందు ముందు చాలా ప్రమాదాలు వాటిల్లుతాయి' అని భావించే కిరణ్ - 'వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు తమ తమ స్వలాభాల కోసం వాళ్ళ ఉద్యమాలలోకి విద్యార్థులను ప్రేరేపించటం చాలా అవాంఛనీయమైన విషయం' అంటుంది.

కిరణ్ బతూరా కథలు కూడా రాస్తుంది. ఆమె రాసిన ఆంగ్ల కథలు పత్రికల్లో ప్రచురింపబడ్డాయి.

తన తండ్రి మీరట్‌కు బదిలీ కాకముందు కిరణ్ బెంగళూరులోని 'సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్స్ గరల్స్ హైస్కూలు'లో చదువుకుంటుండగా — 'నేను పెద్దయ్యాక నా జీవితాన్ని ఎలా మలచుకుంటాను' అన్న శీర్షికపై జరిగిన వ్యాస రచన పోటీలో పాల్గొంది. అలవాటు ప్రకారం బహుమతి గెల్చుకుంది.

తన జీవితాన్ని ఎలా మలుచుకోవాలనీ ముందే నిర్ణయించుకోగల 'కిరణ్' లాంటి వనితలకు జీవితంలో ఎప్పుడూ విజయాలే లభ్యమవుతాయనడంలో సందేహం లేదు! □

తెచ్చిపెట్టుకున్న క్రోధమూ, నటనా అసలేలేవు.

అతి దీనంగా కనులెత్తి మెల్లగా అడిగింది. 'ఇక నేను....మీకూ అక్కర్లేదామ్మా? నన్నిక్కడ వుండనీయరా?'

తెల్లబోయింది పార్వతి ఆ జాలిపలుకులు విని.

'నేనేమైనా పొరపాటు చేస్తే, చెప్పి నువ్వే శిక్షించమ్మా. కానీ నన్నిక్కడినుంచి పంపివేయకు'. జలధారలు ప్రవహించసాగాయి. 'అమ్మ, నాన్నగారు ఎవ్వరికీ నేనక్కరలేదు. నీకూ నేను వెగటయ్యానా?' ఏడుస్తూనే అడగసాగింది.

'ఎంత అమాయకురాలవు మీరా!' ప్రేమ పొంగి పొర్లగా, జాలి వర్షించగా, ఆ అశ్రువులను ఒత్తుతూ, 'ప్రతి ఆడపిల్లా పెళ్ళై వెళ్ళవలసిందే తల్లీ. ఎంత బాధైనా యిది తప్పదు'. అన్నది.

వింటూనే వెక్కిళ్ళతో ఏడ్వసాగింది మీరా. 'నాకిక్కడే బాగుందమ్మా, నాకు పెళ్ళి వద్దు. ఎవ్వరూ వద్దు. మీరే కావాలి. నువ్వే పని చెప్పినా చేస్తాను. కానీ నన్నెవరికీ యిచ్చి వేయొద్దు'.

ఆ ముగ్ధకు అర్థమయ్యేలా ఎలా చెప్పాలో, ఏమి చెప్పాలో తెలియక విస్మితురాలై నిలబడిపోయింది పార్వతి. 'నీవు వెళ్ళిపోతే నాకు మాత్రం బాధ కాదా తల్లీ? నేనెలా పంపగలను నిన్ను?' అన్నది అక్కున జేర్చుకొంటూ:

ఒకరినొకరు పెనవైచుకుని మూగగా రోదిస్తున్న ఆ తల్లీ బిడ్డలు కాని తల్లీతనయలను చూచి రామదాసు నిశ్శబ్దంగా నిష్క్రమించాడు అక్కడినుండి.

'మీరా మనసు చాలా సున్నితం. దానికి తోడు పసితనంలోనే ఘోరమైన బాధలకు గురి అయిన ఆమె జీవితమంటే భయపడిపోతున్నది. ఈ భయం నుండీ, అపోహల నుండీ ఆమె మనసును నెమ్మదిగా నేర్పుగా మరలించాలి!'

అదీకాక....సంబంధాలు వెతకడం, వివాహం చేసి పంపడం సాధారణ విషయం కాదు. ఎలాగ? ఎలాగ ఈ గురుతరమైన బాధ్యతను సవ్యంగా నిర్వహించేది? తన విద్యార్థి గోపాల్ లక్షణమైన యువకుడు. మీరా అంటే అభిమానమున్నట్లే ప్రవర్తిస్తాడు. కానీ....అతడి కుటుంబం సనాతనాచారాలుగలది.

అయితేనేం, అడిగి చూస్తే? మీరా అదృష్టం అంతా! అదృష్టాన్ని నమ్మి కూర్చోలేము. ప్రయత్నం చేయాలి కదా! [సశేషం]

[ఆఫీసరుగారి అబ్బాయి: 9 వ పేజీ నుంచి]

అమ్మో....ఈ అమ్మాయా? క్లాసులో తన ముందు బెంచీలో కూర్చుని ఏ స్టూడెంటునీ లెక్చరర్‌నీ లెఖ్ఖ చెయ్యకుండా తకాయించి మాట్లాడే లీల! ఈ లీలని చూసేనా తను విజిల్ వేసింది? భయంతో గుండె దడదడలాడింది. పక్క సందులోకి తప్పుకుందాం అని చూశాడు. కాని ఇంతలో లీల మళ్ళీ నవ్వి. 'మాట' అన్నట్లు కళ్ళతో సంజ్ఞ చేసింది. ఇంక వెనకాల్నే వెళ్ళక తప్పింది కాదు తనకి. దగ్గరగా వెళ్ళి ఇటూ అటూ చూసి నెమ్మదిగా జంకుతూ 'ఎందాకా?' అన్నాడు.

లీల అదోలా నవ్వి 'అలా పార్కు వరకూ—వస్తారా?' అంది.

తనకి ఆనందంతో ఒళ్ళు ఝుళ్ళుమంది. 'జీవితంలో ఇవాళ ఎంత మంచి రోజు' అనుకుంటూ ఆమె వెనకాలే అడుగులో అడుగు వేసుకుంటూ బయలుదేరాడు తను....

జయరాంకి ఎదురుగా కంకర పట్టుకు వస్తూన్న లారీ కనిపించింది. స్టీరింగ్ ఎడమపక్కకి కొయ్యబోతే, పక్కనే గడ్డి బండి వుంది. మళ్ళీ స్టీరింగ్ కుడికి కోశాడు. బస్సులో జనం ఉయ్యాల ఊగినట్లు ఇటూ అటూ ఊగారు. అలా వెళ్ళిన బస్సే మళ్ళీ ఇలా తిరిగిందేమిటి అని కంగారుపడి కంకర లారీ డ్రైవరు కంగారుగా రోడ్డు వారకి డ్రైవ్ చేశాడు. తల వెంట్రుకవాసిలో ఒకదాన్ని ఒకటి దూసుకుని వెళ్ళిపోయాయి—లేకపోతే బస్సూ, లారీ, ఒకదాన్ని ఒకటి ఢీకొనివుండేవే—

పార్కులో వయ్యారంగా పమిట సర్దుకుంటూ లీల తనకేసి చూసినప్పుడు జయరాం ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. ఎప్పుడూ తనకేసి కన్నెత్తి అయినా చూడని లీల ఇవాళ ఇలా కరుణించిందేవిటి? కాళ్ళు ముడుచుకొని చేతితో గడ్డిపరకని తీసి చెంపకి రాసుకుంటూ కూర్చున్నాడు తను.

'జయరాం'—ఆ పిలుపులో ఏదో వేదన, బాధ.

బరువుగా వినిపించిన ఆమె కంఠ స్వరం విని కళవళ పడి "ఏం లీలా?....ఏదో చెప్పబోయి మానేశావేం?" అన్నాడతను. లీల వెంటనే జవాబు చెప్పలేదు. అరిచేతితో పచ్చగడ్డి మొక్కల చివళ్ళని అలవోకగా తాకుతూ 'అబ్బే. మరేంలేదు....మరి....మరేమో....మీరు పెద్ద డబ్బున్నవారు కాదు కాబోలు' అంది.

'అని ఎవరన్నారు? ఎవరో కిట్టని వాళ్ళు అనివుంటారు. నేనొక ఆఫీసరు కొడుకుని. తెలుసా?' అన్నాడు తను ఆవేశంగా ఆమెకి ఇంకొంచెం దగ్గరగా జరుగుతూ.

'అహ....అయితే....'

'ఏం? ఆగిపోయావేం? చెప్పు. సందేహించకు'.

'మరి....మరి....నాకు అర్జంటుగా ఏభై రూపాయలు కావాలి. మా నాన్నగారికి జబ్బుగా వుంది. ప్రస్తుతం అప్పుగా ఇస్తే....త్వరలో తీర్చేస్తాను.... అఫ్‌కోర్స్....సర్దగలిగితేనే—'

'ఓ .. దానికేం. రూమ్‌లో ఉంది డబ్బు.... మీ ఇల్లు ఆనవాలు చెప్తే తీసుకువచ్చి ఇస్తాను.'

'అమ్మో....మా నాన్న మిమ్మల్ని చూస్తే ఇంకేమైనా ఉందా?....నేనే మీ రూమ్‌కి వస్తా.... ఏం?....అభ్యంతరమా?'

'అబ్బే....అభ్యంతరం ఏవిటి? తప్పకుండా రా' అంటూ తను లీల కళ్ళల్లోకి అదోలా చూశాడు.

ఆమె చిరునవ్వుతో మొహం అటు తిప్పుకుని 'మరైతే....ఆటోరిక్షా ఒకటి పిలిస్తే' అంది.

లీలతో కలిపి ఆటోరిక్షాలో వెళుతూన్నప్పుడు నేల మీంచి నింగికి రెక్కలు కట్టుకుపోతున్నట్లనిపించింది తనకి. ఈమెకి ఏభై ఏవిటి అడిగితే ఎంతేనా ఇద్దాం అనిపించింది తనకి ఆ క్షణంలో.

పెట్టె తీసి లెఖ్ఖ పెట్టకుండానే చేతికి వచ్చిన పది రూపాయల నోట్లు బొత్తి ఆమె చేతిలో పెడుతూ కావాలనే వేళ్ళతో ఆమె చేతిని తాకాడు తను. ఆమె అదోలా నవ్వింది. తన మనస్సులో ఆశ చిగిర్చింది. 'కాస్సేపు కూర్చోకూడదూ, కబుర్లు చెప్పుకుందాం' అన్నాడు తను.


'కాదు....ఇప్పుడు వెళ్ళాలి. మరోమాటు అలాగే ఏం?' అంటూ చిలిపిగా చూసి వెళ్ళబోయి, మళ్ళీ ఒక్క అడుగు వెనక్కి వేసి 'అవును గానీ...' అంటూ అర్ధోక్తిగా ఆగిపోయింది లీల.


తను ఆసక్తిగా ఆమె ముఖంలోకి చూశాడు.

'అవునూ—కాలేజీలో ఈ మధ్య తరుచు మీ దర్శనం కావడం లేదు. ఏవిటి విశేషం?' అంది లీల.


దాంతో తనలో ఏదో లేని ఉత్సాహం పెల్లుబికింది. తన కోసం రోజూ క్లాసులో చూస్తోందన్నమాట! క్లాసు కోసం కాకపోయినా లీల కోసమైనా ఇక ముందు నుంచి కాలేజీకి రోజూ

★ మీ యింట్లో చిరిగిపోయిన పాంట్లు వుంటే వాటిని పారేయకండి. వాటి 'కాళ్ళు'–సంచులుగా చేసుకోడానికి ఉపయోగపడతాయి. పాంటు కింద వున్న మడత, సంచి పట్టుకునే సాధనంగా అతకవచ్చు. మరీ పాత బట్ట కాకుండా వుండాలి. అంతే!






★ పూల కుండీ(వాజ్)ల్లో పెట్టిన పువ్వులు త్వరగా వాడిపోతున్నాయనిపిస్తే ఒక పని చెయ్యండి. 'ఆస్ప్రిన్' మాత్రను చిదగ్గొట్టి పొడిచేసి, ఆ పొడిని పూల కుండీలలో వున్న నీళ్ళలో కలపండి. మూడు రోజుల వరకూ పువ్వులు నవనవలాడుతూ వుంటాయి.




★ ఇంట్లో చీమల బాధ ఎక్కువగా వుంటే-ఒక పని చెయ్యండి. ఒక గ్లాసుడు నీళ్ళలో కాస్త పొగాకును నానబెట్టి, ఆ నీళ్ళను చీమలు వచ్చే కన్నాల్లో పొయ్యండి. చీమలు బయటికి రావు.

★ మీ యింట వున్న 'అలారం టైంపీస్' అలారం కొడితే మీకు సరిగ్గా వినిపించడం లేదనుకోండి. ఆ టైంపీసును ఒక రేకుమీద పెట్టండి. అలారం చప్పుడు బాగా వినిపిస్తుంది.





★ 'కాఫీ ఇంకా బాగుండాలి' అని మీకుగాని, మీ వారికిగాని అనిపిస్తే-చిటికెడు టేబిల్ సాల్ట్ అందులో కలపండి. రుచి ఎక్కువ అవుతుంది.



★ ఉడికించిన కోడిగుడ్లు మూడు నాలుగు వారాల వరకూ చెడకుండా వుండగలవు. ఎలాగో తెలుసా? ఉడికించిన తర్వాత, వాటి పై పెంకు తీసేసి, ఆ గుడ్లను నీళ్ళలో వేసి – అలాగే రిఫ్రిజిరేటర్లో పెడితే చాలు! —యన్. భువనేశ్వరమ్మ

విధిగా హాజరవుతూ వుండాలి. 'ఆల్‌రైట్!.... రేపటినుంచి తప్పకుండా అటెండెన్స్ వేయించుకుంటా....అదే....క్లాసులో'

ఇద్దరూ నవ్వుకున్నారు.

వెనకాల సీట్లో ఎవరో కొత్త దంపతులు కాబోలు పకపక నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. తల వెనక్కి తిప్పి చూడబోయి కూడా ఆగిపోయి, ముందు చక్రం కింద పడబోయిన ఓ ముసలాడిని తప్పించి, స్టీరింగుని బాగా ఎడమ వైపుకి కోసి వెంటనే మళ్ళా కుడి వైపుకి తిప్పారు జయరాం. బస్సులో ఉన్న జనం దాంతో, పూనకం వచ్చిన వాళ్ళలాగ ఒక్కమారు ఇటు నుంచి అటు ఊగి, ఆగారు.

ఆ తర్వాత లీల ఎన్నిసార్లో వచ్చి తన దగ్గర పదీ పాతికా పట్టుకువెళ్ళేది. ఆమె చిరునవ్వుకి కానుకగా, డబ్బు అడిగినప్పుడల్లా ఇస్తూ, తక్కువైనప్పుడల్లా ఇంటికి ఉత్తరాలు ఇచ్చి వందలకి వందలు తెప్పించసాగాడు తను. లీల మెప్పుకోసం, రోజూ రెగ్యులర్‌గా కాలేజీకి రావడం, లెక్చరర్ల పాఠాలు మాట ఎలా ఉన్నా రోజు రోజుకీ లీల రూపాన్ని మాత్రం హృదయం నిండా నింపుకోవడం, కాళీ దొరికినప్పుడల్లా కాలేజీలోనూ బయట ఊళ్ళోనూ, లీలతో కబుర్లు చెబుతూ కాలక్షేపం చెయ్యడం, ఈ అవకాశానికి ఎక్కడ అడ్డు వస్తారో అనే భయంతో ఇతర స్నేహితులతో తిరగడాన్ని కొంత తగ్గించడం, ఇలా జరిగిపోతున్నాయి రోజులు.

తనకీ లీలకీ మధ్య పరిచయం పెరగడాన్ని సహించలేని క్లాస్‌మేట్లు కొందరు 'ఏరా జయరాం ఏవిటీమధ్య మాతో కలవడం పూర్తిగా మానేశావు? నల్ల పూసయిపోయావు. ఏమిటి నీలీలలు?' అంటూ అప్పుడప్పుడు పలకరించసాగారు. కొందరైతే 'ఓ పది రూపాయలు అప్పు ఇవ్వమ' ని అడిగి, వెంటనే 'అవున్లే ఇంక మాకెందుకిస్తావు? ఇప్పుడు ఎంతసేపూ నీకా లీలకి అప్పు ఇవ్వడానికే సరిపోతుంది ఎంత డబ్బున్నా' అంటూ నిష్ఠూరంగా అనసాగారు. మరికొందరైతే 'ఆమెకి నువ్వు అప్పు ఇవ్వడం ఏవిటోయ్ గోంగూర? ఆమె ఏం డబ్బులేంది అనుకుంటున్నావేమిటి? వాళ్ళ నాన్న పెద్ద ఆఫీసరు తెల్సా' అంటూ వెటకారంగా నవ్వసాగారు.

ఒకప్పుడు వాళ్ళ మాటలు వింటే తనకి నవ్వు వచ్చేది. ఒక్కొక్కప్పుడు చిరాకేసేది. లీల తండ్రి ఆఫీసరా? ఆమెకి డబ్బు అవసరం లేదా? మరైతే 'మా నాన్నగారు రెండు మూడు నెలల నుంచి జబ్బులో వున్నారని, ఇంట్లో నానా అవస్థగా వుందనీ, కాలేజీకి మానలేక వస్తున్నాననీ, అడగలేక అడగలేక అప్పు అడుగుతున్నాననీ' వచ్చే కన్నీటిని ఆపుకొంటూ లీల అనడం అంతా వట్టి నటనే? అబద్ధమే?

అ....నాన్సెన్స్....తను ఆమెతో మాట్లాడడం, తనకీ ఆమెకీ ఎక్కువ పరిచయం అవుతూ వుండడం, ఈ కారణంగా తను ఎక్కువ టైము ఆమెతోనే గడపడం, అందువల్ల పూర్వంలాగ వీళ్ళందరితో తిరిగి వీళ్ళకి కాఫీలు ఇప్పిస్తూ అప్పులు ఇస్తూ వుండడాన్ని తగ్గించెయ్యడం, ఇదంతా సహించలేక అసూయతో అనే మాటలు కాని, లీల తండ్రి ఆఫీసరు ఏమిటి, ఆమె తనతో అబద్ధం చెప్పడం ఏమిటి?

జయరాం చటుక్కున వ్యూఫైండరులోకి చూసి 'ఆ అమ్మాయిని చెయ్యి లోపల పెట్టమను' అంటూ గట్టిగా కండక్టరుని ఉద్దేశించి అరిచాడు...

రోజులు మధురంగా గడచిపోతున్నాయి. తనని చూడకుండా లీల, లీలని చూడకుండా తనూ ఉండలేకపోతున్నారు. లీల కళ్ళల్లో మెరిసే అందాలు చూడడానికే, తను రెగ్యులర్‌గా కాలేజీకి వెళ్ళడం ప్రారంభించాడు. వెళ్ళడం వల్ల, అడపా తడపా పాఠాలు, చెవిని పడటం, అందువల్ల పరీక్షల్లో కాస్త సంతృప్తిగా రాయడం జరిగింది. అలాగే, తరచు పదీ, పాతికా లీలకి ఇవ్వవలసి వస్తుండడం వల్ల తన ఖర్చుల్ని కూడా తగ్గించుకోవలసివచ్చింది. రోజుకి నాలుగు పెట్టెలు సిగరెట్లు కాల్చేవాడల్లా, ఒక పెట్టెలోకి, వారానికి రెండు మూడు సినిమాలు చూసేవాడల్లా నెలకి ఒకటి చూడడంలోకి వచ్చాడు. ఇంకా ఇలా ఎన్నో లాభాలు లీల స్నేహం వల్ల తనకి కలిగాయి. అన్నింటి కంటే తనకి చెరు సహవాసాలూ, వాళ్ళతో తిరగడం వాళ్ళ కోసం డబ్బు ఖర్చుపెట్టడం తప్పాయి లీల ధర్మమా అని.

ఆ రోజున లీలని ఒప్పించి సినిమాకని ప్రోగ్రాం వేసుకున్నాడు. అయిదున్నరకల్లా వస్తానన్న లీల ఇంకా రాలేదు. నిమిష నిమిషానికీ వాచి చూసుకుంటూ పచార్లు చేస్తున్నాడు తను. ఒకటి రెండుసార్లు వీధి గేటులోకి వెళ్ళి చూసి వచ్చాడు. ఏవిటి ఇంత ఆలస్యం చేసింది? ఇంటికి

వస్తుందా, రాదా? రాదేమో! అస్థిమితంగా అటూ ఇటూ నడుస్తూ మాటిమాటికీ వీధి గేటుకేసి చూస్తూ క్షణం ఒక యుగంలా గడుపుతున్నాడు.

ఇంతలో 'టెలిగ్రాం' అంటూ మెసెంజరు వచ్చి ఒక టెలిగ్రామ్ తన చేతిలో పెట్టి సంతకం చేయించుకుని వెళ్ళిపోయాడు. టెలిగ్రాం తన చేతుల్లోంచి జారిపోయింది. 'ఫాదర్ సీరియస్ — స్టార్ట్'—అచేతనంగా అలా ఎంత సేపు ఉండిపోయాడో — లీల వచ్చి అలా నిలబడి వుండిపోయిన తనని పలకరించడం కాని, నేల మీద పడి ఉన్న టెలిగ్రాంని చదవడం గాని, సానుభూతిగా తనని పలకరించి ధైర్యం చెప్పడం కాని ఇవేం గమనించే స్థితిలో లేడు తను. ఇంతలో ఇంటికి ఎప్పుడు వెళ్ళిందో మళ్ళీ ఎప్పుడు తిరిగి వచ్చిందో, పెద్ద నోట్ల కట్ట తీసుకు వచ్చి జేబులో పెడుతూ, 'ఈ డబ్బు తీసుకుని వెళ్ళు జయరాం. అక్కడ మీ అమ్మగారు ఏం అవస్థ పడుతున్నారో ఏమో' అంది గద్గదికమైన కంఠంతో.

తను ఉలిక్కిపడి 'ఇంత డబ్బు ఎక్కడిది నీకు?' అన్నాడు. లీల తేలిగ్గా నవ్వేస్తూ, 'ఎక్కడిదేమిటి? ఇంత క్రితం నువ్వు ఎన్నో మార్లు ఇవ్వలేదూ నాకు? అయినా ఇప్పుడా ప్రశ్నలన్నీ ఎందుకు? ముందు కావలసిన పనేదో చూడు' అంది.

తను ఇంటికి వెళ్ళేటప్పటికే అంతా అయిపోయింది. అమ్మని ఆ స్థితిలో చూడలేకపోయాడు. ప్రాణం లేని కట్టెలా కావలసిన తంతు ఏదో పూర్తి చేశాడు. అన్నీ అయ్యాక స్థిమితంగా చూసుకుంటే తనూ, అమ్మా ఎంతో దయనీయమైన స్థితిలో ఉన్నట్లు తేలింది. ఆఫీసరుగా నాన్నగారు ఎంతో దాబుగా బ్రతికారు కాని నిజంగా ఆయనకి పోయే రోజు నాటికి బేంక్‌లో ఉన్న బేలన్స్ పట్టుమని పాతిక రూపాయలు. ఊళ్ళో అయిదారు వేల రూపాయల బాకీలు. ఇన్‌స్టాల్‌మెంటు మీద తీసుకున్న కారు బాకీ ఇంకా సగం పైన అలాగే వుంది. అమ్మ వంటి మీద నగలు, ఇంట్లో కొన్ని ఖరీదైన వస్తువులు కారు, ఇవన్నీ అమ్మేసి అప్పులు తీర్చెయ్యగా ఇంక తనూ, అమ్మా మిగిలారు. నాన్నగారి తాలూకు ఫేమిలీ పెన్షన్ ఇంకా ఏడాది దాకా వచ్చేలాగ లేదు. అందాకా తమకి రోజు గడిచేదెలాగ? తన చదువు ఎలాగ గట్టుఎక్కేటట్టు?

తీవ్రంగా ఆలోచించి ఆలోచించి తను చివరికి ఒక నిర్ణయానికి వచ్చాడు, ముష్టి ఎత్తి చదువుకోవటం కంటే కష్టపడి పని చెయ్యడం మంచిది. ఏ ఉద్యోగం అయినా సరే, ఆఖరికి కూలి పని అయినా సరే చేసి అమ్మకి అన్నం పెట్టాలి. ఇలా నిర్ణయానికి వచ్చి, చేసిన వందల కొద్ది ప్రయత్నాల్లో ఏ ఒక్కటీ ఫలించకపోగా, చివరికి ఈ బస్సు డ్రైవరు ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాడు—చిన్నప్పటి నుంచీ ఇంట్లో ఉన్న చిన్న కారుని డ్రైవ్ చేసిన అనుభవాన్ని పురస్కరించుకొని.

ఇంటర్వ్యూయింగ్ ఆఫీసర్‌ని మెప్పించాడు. ఆర్. టి. సి. లో డ్రైవరుగా సెలక్ట్ అయాడు. అయితే, 'మా నాన్నగారికి నిన్ను చూపించి మన పెళ్ళికి ఆయన అనుమతిని సంపాదిద్దాం' అంటూ లీల తనని వాళ్ళ నాన్నగారి దగ్గరికి తీసుకువెళ్ళడంతోటే, తన అదృష్టం తిరగబడిపోయింది. లేకపోతే, తనకి డ్రైవరు ఉద్యోగం ఇచ్చిన ఇంటర్వ్యూయింగ్ ఆఫీసరే లీల తండ్రి కావడం ఏమిటి? తనూ లీలా ఎన్ని రకాలుగా ప్రార్థించి ప్రాధేయపడినా ఆయన 'ఛేట్ - వీల్లేదు. ఈ డ్రైవరునా నా కూతురు పెళ్ళి చేసుకొనేది'— అంటూ ఆయన తీవ్రమైన అభ్యంతరాన్ని కలిగించాడు.

'నువ్వు పూర్వం ఒక ఆఫీసరు కొడుకువైతే కావచ్చు, కాని నువ్వు ఇప్పుడొక డ్రైవరువి. నువ్వే కనక జాగ్రత్తగా చదువుకొని, దురభ్యాసాలకి లోనుగాకుండా ఉంటే ఫస్ట్ క్లాసే వచ్చేది. మంచి ఉద్యోగమే దొరికేది. మా లీలని నీకిచ్చి పెళ్ళి చేయడమే పడేది. కాని ఇప్పటి నీ పరిస్థితిలో మా లీల గురించి ఆలోచించడానికి కూడా నీకు వీలులేదు. మా లీలలాంటి అన్ని విధాలా యోగ్యురాలైన పిల్లని పెళ్ళి చేసుకోవాలనే ఆశ నీకు ఉంటేనే చాలదు. అందుకు యోగ్యమైన జీవితాన్ని గడపగలిగే సామర్థ్యం కూడా వుండాలి. పెడసరపు బ్రతుకు బ్రతికి పెద్దింటి పిల్లల కోసం అర్రులు చాస్తే ఎలా?.... వెళ్ళు.'

అని లీల తండ్రి అంటున్నప్పుడు కాలి క్రింద భూమి కదిలినట్లయింది. పశ్చాత్తాపంతో తల నేల మీదకి వంగిపోయింది. కన్నీళ్ళతో నిలబడిపోయిన లీల మాత్రం ఏం చెయ్యగలదు? నిజమే — ఆయన అన్నది అక్షరాలా నిజం — పెద్ద ఆలోచనలు ఉన్నప్పుడు పెద్ద మనిషిగానే జీవించాలి. గిరుక్కున తిరిగి వెనక్కి వచ్చేశాడు తను. జరిగిపోయిన జీవితాన్ని, తిరిగి పొందే అవకాశం భగవంతుడు ఇస్తే, తను ఎంతో ఆదర్శంగా ఉన్నతంగా జీవిస్తాడు. చెడు సహవాసాలు చెయ్యకుండా బాధ్యతగా బాగా చదువుకుంటాడు. కాని ఆ అవకాశం ఎలా వస్తుంది? రాదు. ఈ జన్మకింక ఇంతే! కానయితే, తనపట్ల అభిమానంతో తను ఒక బీదవాని కూతురునని అబద్ధమాడి తన జీవితంలో ప్రవేశించి, అర్థంలేని స్నేహితుల నుంచీ, విచ్చలవిడిగా చేసే ఖర్చు నుంచీ, తనని తప్పించడానికి ప్రయత్నించింది లీల — కాని ఆమె ప్రయత్నం కొంచెం ఆలశ్యంగా ప్రారంభమైంది. అయినా ఫలితం బాగానే వచ్చి వుండును, నాన్నగారు కనక అంత హఠాత్తుగా చనిపోయి వుండకపోతే — పై పరీక్షలలో బాగా చదివి ఫస్ట్ క్లాసు తెచ్చుకుని వుండును. మంచి ఉద్యోగం ఏదైనా వచ్చి వుండును. ఇంతకీ ఆ యోగం లేదు తనకి—

ఇలా ఆలోచిస్తూన్న జయరాంకి వెనక నుంచి చిన్న కారు హారన్ వినిపించింది. ఎంత సేపటి నుంచి వేస్తూన్న హారనో అది. ఆలోచనలలో ఉండి ఇంత దాకా తను వినిపించుకోలేదు. ఆ కారుకి సైడివ్వాలి. వ్యూ ఫైండరులోంచి చూశాడు. అందంగా తళతళా మెరుస్తూన్న కొత్త కారు. ఎవరో పాతికేళ్ళ యువకుడు కాబోలు ఖరీదైన దుస్తుల్లో కూర్చుని కారు డ్రైవ్ చేస్తూ మధ్య మధ్య పక్కనే ఫారెన్ నైలెక్స్ చీరలో దంతపు బొమ్మలా కూర్చున్న భార్యతో నవ్వుతూ మాట్లాడుతున్నాడు.

జయరాం సైడిచ్చాడు. ఖరీదైన కారు బస్సుని దూసుకుని ముందుకు పోయింది. పోయేటప్పుడు ఆ కారులో వున్న దంతపు బొమ్మ నవ్విన నవ్వు!.. లీల నవ్వులా.... ఆ దంతపు బొమ్మ లీలేనా?.... అవును! ఆ కారులో ఖరీదైన దుస్తుల్లో డ్రైవ్ చేస్తూన్న యువకుడు ఆమె భర్తా?.... జాగ్రత్తగా చదువుకొని పైకి వస్తే ఆ స్థానంలో తనుకదా వుండవలసింది!.... నాన్నగారు ఆఫీసరు అనే అహంకారంతో జీవితం గడిపి, కోరిన భార్యతో కలిసి హాయిగా కారు డ్రైవ్ చేసుకొని వెళ్ళే యోగానికి బదులు, ఈ యోగం పట్టింది. ఆలోచనలు — ఆలోచనలు — ఒక్కమాటు తల గిర్రున తిరిగి, జయరాం స్టీరింగ్ మీద అచేతనంగా వాలిపోయాడు. అనుకొన్న నిడదవోలు రాలేదు. మార్గ మధ్యంలోనే ఆగిపోయిన బస్సులోంచి, జయరాంని చేతులమీంచి ఇవతలకి తీసి, వేరే బస్సుమీద నిడదవోలులో వున్న వాళ్ళ అమ్మకి పంపారు. అలా ఏదో రకంగా గమ్యం చేరినా, జీవితంలో గమ్యం చేరని లోటు లోటుగానే వుండిపోయింది జయరాంకి. *